# వెన్నెల మండింది




సారెరామమోహనరావు

రాత్రి తొమ్మిదిన్నరయింది. వెన్నెల చల్లగా, చిక్కగా కురుస్తోంది.

నేషనల్ హైవే రోడ్డు నిర్మానుష్యంగా వుంది. ఆ రోడ్డుమీద ఓ యువకుడు చకచకా అడుగులు వేస్తున్నాడు. అతను డ్యూటీ దిగి ఇంటికి వెళుతున్నాడు ఆకలి వేస్తోంది. ఇంటికివెళ్ళి గబగబా అన్నం తినేయాలని వుందతనికి.

వేగంగా అడుగులు వేస్తున్నాడు.

అదే సమయంలో—

ఆ రోడ్డుమీద ఓ తాగుబోతు డ్రైవరు జీప్‌ను అస్తవ్యస్తంగా నడుపుతున్నాడు. తాగి వున్నాడేమో. రోడ్డుమీద నడుస్తున్న యువకుడు అతని కంటికి ఆనలేదు. జీప్‌ని ఆ యువకునికి గుద్దించేశాడు. అంతే! అల్లంత దూరం ఎగిరి పడ్డాడా యువకుడు.

ఆ యువకునికిఏమయిందోననివెన్నెల హడలిపోయింది.

డ్రైవర్ మత్తు విరిగిపోయింది.

జీపు ఆపేశాడు. రోడ్డు నిర్మానుష్యంగా వుంది. జాప్యంచేస్తే ఎవరైనారావొచ్చనే భయంతో గబగబా జీప్‌ని స్టార్ట్‌చేసి లాగించేశాడు.

ఆ యువకుడు అచేతనంగా పడి వున్నాడు. స్పృహ కోల్పోయాడు. తల చిట్లింది. రక్తం కారిపోతోంది.

ఆ దృశ్యాన్ని వెన్నెల జాలిగా చూస్తోంది. ఎవరైనా వచ్చి ఆ యువకుడిని రక్షిస్తారేమోనని ఎదురుచూస్తోంది.

ఇంతలో ఓ వ్యక్తి అక్కడికి వచ్చాడు.

అచేతనంగా పడివున్న ఆ యువకుడిని చూశాడు.

"అయ్యో! పాపం!" అని అనుకున్నాడు.

ఆ యువకుడిని హాస్పిటల్‌కి తీసుకెళ్లే ప్రయత్నంచేయడం, పోలీస్‌రిపోర్టివ్వడం, ఆ తరువాత కోర్టుచుట్టూ తిరగడం— ఇదంతా తలకుమించినపని. ఈ లంపటం అంతా ఎవడు పడతాడు? మరెవరైనా ఈ గాయపడ్డ వ్యక్తి గురించి శ్రద్ధ తీసుకుంటార్లే— అని అనుకుని ఆ వ్యక్తి అక్కడి నుంచి కదిలిపోయాడు.

వెన్నెల అసహాయంగా చూస్తోంది.

కొద్దిసేపటికి ఆ వైపుగా ఓ స్కూటర్ దూసుకొచ్చింది. స్కూటర్ మీద వ్యక్తికి రోడ్డుమీద అచేతనంగా పడివున్న ఆ యువకుడు కనిపించాడు. రక్తం మడుగు కట్టింది. వెన్నెల వెలుగులో సింధూరంలా గోచరిస్తోంది.

స్కూటర్ ఆపి "అరెరె!" అన్నాడు. జాలిపడ్డాడు.

వెంటనే హాస్పిటల్‌కి తీసుకెళితే బతుకుతాడు.

స్కూటర్‌వాలా వాచీ చూసుకున్నాడు.

పావు తక్కువ పదయ్యింది. మరో పది నిముషాలలో సినిమా స్టార్ట్ చేసేస్తారు. తన ప్రేయసి ఆరోజు తనని సినిమాకు రమ్మంది. టికెట్స్ తీసి నీకోసం ఎదురుచూస్తుంటాను అని చెప్పింది. ఇప్పుడీ యువకుడిని హాస్పిటల్‌కు తీసుకెళితే... సమయం వృథా అయిపోతుంది. తను వెళ్ళకపోతే తన ప్రేయసి తనని అపార్థం చేసుకుంటుందేమో! అయినా హాలులో వంటరిగా తన ప్రేయసి పొందును తను పోగొట్టుకోగలడా? నో!

వెంటనే స్కూటర్ స్టార్ట్‌చేసి వేగంగా ముందుకు దూకించాడు.

వెన్నెల ఆ దృశ్యాన్ని బాధగా చూస్తోంది.

ఓ మోటార్ సైకిల్ ఆ దారినే వస్తోంది. మోటార్ సైకిల్‌మీది వ్యక్తికి ఆ యువకుడు కనిపించాడు. రోడ్డుమీద రక్తం మరింతగా మడుగుకట్టింది.

హఠాత్తుగా మోటర్‌బైక్ ఆపాడు.

"అయ్యో ఎంత ఘోరం జరిగింది!" బాధపడ్డాడతను. "వాడు మనిషా?పశువా?" అని యాక్సిడెంట్ చేసిన డ్రైవరిని తిట్టుకున్నాడు.

టైమ్ చూసుకున్నాడు. పదీ ఇరవై. మరో పది నిముషాలలో పార్క్ హోటలులో పార్టీ స్టార్టయిపోతుంది. తన నవలకు ఓ ప్రముఖ పత్రికలో బహుమతి వచ్చింది. స్నేహితులంతా పార్క్ హోటల్లో తనకి సన్మానంలా పార్టీ చేస్తున్నారు. ఇప్పుడితనిని హాస్పిటల్‌కి తీసుకెళితే ఎలా? తన మిత్రులంతా డిజప్పాయింట్ కారూ! అదీకాక అతనికి ఆ సమయంలో కళ్ళముందు విస్కీ గ్లాసులు, కోడి కక్కలు, జీడిపప్పు వేపుడు మెదిలాయి.




అంతే!

ఏమాత్రమూ ఆలస్యం చేయకుండా మోటార్ బైక్‌ను వేగంగా ముందుకు పోకించాడు.

వెన్నెల ఆతృతగా ఎదురుచూస్తోంది. ఏ పుణ్యాత్ముడైనా వచ్చి ఆ యువకుడిని కాపాడక పోతాడా అని.

ఓ పంజాబీవాడు, ఓ మహారాష్ట్రవాడు ఓ కేరళా వాడు, ఓ మద్రాసివాడు— వీళ్ళంతా డ్రైవర్లు. ఓ రాష్ట్రం నుంచి మరో రాష్ట్రానికి లోగాలు చేరవేస్తున్న వాళ్ళు. లారీలలో వెళ్ళిపోతూ ఆ దృశ్యాన్ని చూసి తమకు పట్టనట్లుగా లారీలు ముందుకు నడుపుకుంటూ వెళ్ళిపోయారే కాని ఆ యువకుడిని హాస్పిటల్‌కు చేర్చే ప్రయత్నం చెయ్యలేదు.

సమయం పదకొండయింది.

వెన్నెల ఆ యువకుడిని జాలిగా చూస్తోంది. ఆత్రుత కనబరుస్తోంది .. ఎవరైనా వచ్చి ఆ యువకుడిని ఆదుకుంటారేమోనని.

ఓ పోలీస్ కానిస్టేబుల్ వేగంగా నడుచుకుంటూ వస్తున్నాడు.

వెన్నెల ఆనంద పడింది. అతను పోలీసువాడు. ఆ యువకుడిని తప్పక ఆదుకుంటాడు.

పోలీస్ కానిస్టేబుల్ రక్తం మడుగులో పడివున్న ఆ యువకుడిని చూశాడు. ఆగిపోయాడు. కళ్ళలో కోపం కట్టలు తెంచుకుని ప్రవహించింది. యాక్సిడెంటు చేసిన ఆ డ్రైవర్ని బండ బూతులు తిట్టాడు.

ఇప్పుడు తను ఈ యువకుడిని హాస్పిటల్లో జాయిన్ చేసి కేస్ బుక్ చేస్తే.... బాగానే ఉంటుంది. కాని, అలా చేస్తే తనకి వొరిగే లాభం ఏముంది? అనవసరంగా సమయం వృధా. డబ్బు లేమీ దొరకవు. ఫర్లాంగున్నర నడిస్తే అక్కడ వేశ్యాగృహాలున్నాయి. అక్కడికి వెళితే తనకు డబ్బు దొరుకుతుంది. సుఖమూ లభిస్తుంది. అనవసరంగా డబ్బులురాని ఈ కేసుని పరిశోధించడం శుద్ధ దండగ.

ఇంకా అక్కడుంటే ఎవరైనా రావచ్చనే వుద్దేశంతో వేశ్యలివ్వబోయే డబ్బుని, వాళ్ళు అందించబోయే సుఖాన్ని తలుచుకుంటూ గబగబా అక్కడినుంచి కదిలిపోయాడా పోలీస్ కానిస్టేబుల్.

వెన్నెలహతాశురాలయింది. మూగగా రోదించింది. అయినా ఆశగా ఎదురు చూస్తోంది... ఎవరైనా వస్తారేమోనని... ఆ యువకుడిని ఆదుకుంటారేమోనని.

ఆఫీసునుంచి భర్త ఇంకా ఇంటికి రాలేదని, తెలుసున్న వాళ్ళింటికెళ్ళి ఫోన్ చెయ్యడానికి ఓ ఇల్లాలు పక్క ఇంటి వాళ్ళబ్బాయిని తో తీసుకుని బయలుదేరింది.

కొద్దిగా దూరంనుంచి ఆ యువకుడిని చూసింది. గబగబా సమీపించింది. చుట్టూ రక్తపుమడుగు.

"ఏవండీ" అంటూ కుదిపింది. చలనంలేదు. యాక్సిడెంట్ జరిగి చాలా సమయం వృధాఅవడం వలన, రక్తం పూర్తిగా కారిపోవడంవలన, ఆ యువకుని ప్రాణాలు అనంతవాయువుల్లో లీనమైపోయాయి.

"ఏ ... వం.... డీ" గట్టిగా గావుకేకవేసి తనకి తాళికట్టిన ఆ శవంమీద కుప్పలా కూలిపోయిందా యిల్లాలు.

వెన్నెల మూగగా అరిచింది.... మానవతా ఎక్కడున్నావు! అని.

వెన్నెలకు సమాధానం లభించలేదు.

అంతవరకూ చల్లగావున్న వెన్నెల మానవతలేని మానవుల మీద క్రోధంతో భగ్గున మండింది.

———